భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

# మృగప్రేమ

ఎం.వి.జె.భువనేశ్వరరావు

మల్లేశం పూటుగా తాగేస్తున్నాడు.........

రాత్రి పదవుతోంది.........

అడవి పలుచనైపోయి..... బట్టలు లేని హీరోయిన్‌లా అర్ధనగ్నంగా అగుపిస్తోన్నాయి అనంతగిరి కొండలు! ...

పుచ్చపువ్వులా విచ్చుకున్న వెన్నెల వెలుగులమాటున తలూడిపోయిన మాడులా మెరుస్తోన్న ఆ కొండల వెనుక... ఊరికి దూరంగా విసిరేసినట్లున్న బాలికల హాస్టల్!

“ఏయ్.......... సుబ్బూ....... సుబ్బూ......... తలుపు తియ్.....”

మందు ఫోర్స్‌తో బలంగా బాదాడు మల్లేశం!

అసంకల్పిత ప్రతీకారచర్యలా...... తలుపు తీసి వెంటనే బయటకొచ్చింది సుబ్బులక్ష్మి.

హెడ్ కానిస్టేబుల్ మల్లేశం ఒక్కసారిగా ‘పులి’ గెటప్‌లో నుండి ‘పిల్లి’ స్టైల్‌లోకి మారిపోయాడు.

“ఊరొదిలి ఇరవై రోజులై పోయింది. ‘బాడీ’ అంతా ఏదోలా ఉండి ‘పడకసుఖం’ కోసం ‘వర్రీ’ అయిపోతా వుంది...” అనునయంగా చెప్పాడు.

వార్డెన్ సుబ్బులక్ష్మికి జాలేసింది... అసలే పోలీసోడు... పైగా బ్రతిమలాడుతున్నాడు.

“సరే. లోపలికి రా........ అల్లరి చేయకూడదు..... వెంటనే వెళ్ళిపోవాలి.......” లోనికి ఆహ్వానించింది.

“హ్హా......... ఎల్లవే.... డొక్కుముండా.... నీకోసం కాదే........ ఎర్రగా బుర్రగా..... ఎత్తుగా..... బుజ్జిగా ఉంటాదే.......... పదోతరగతి చదూతోందే...... నాకది కావాలే.........” గద్దించాడు.

“తప్పు మల్లేశం ..... పేదపిల్ల......... సదువుకొందామని ఎన్నో ఆశలతో ఇక్కడికొచ్చింది. నన్నెలాగైనా చెడిపేశావు.... ముక్కుపచ్చలారని పిల్లని అలా చేయడం మహాపాపం........” బ్రతిమలాడింది.

మల్లేశం గుండె కరగలేదు......

“ఏం చేస్తావో తెలీదు......... నాకిప్పుడు అర్జెంట్‌గా కావాలి.. లేదంటే నువ్వు గిరిజనబాలికలచే వ్యభిచారం చేయిస్తున్నావని ఇన్‌ఫార్మర్స్‌ద్వారా మావోయిష్టులకు కబురంపిస్తాను... వంటసామాగ్రిలో డబ్బు దోచుకుంటున్నావని కలెక్టర్‌కి కంప్లయింట్ పెట్టిస్తాను........” గట్టిగా చెప్పాడు.......... సుబ్బులక్ష్మి గజగజ వణికిపోయింది.......... పరుగు పరుగున ఆరో నెంబరు గదికి వెళ్ళింది.

“అమ్మా! సరస్వతీ... తలుపు తియ్యమ్మా.......” పిలిచింది సుబ్బులక్ష్మి.

మరుక్షణంలో తలుపు తెరుచుకొంది.........

రూమ్‌మేట్లు ముగ్గురూ నిద్రపోయినా ... ఒక్కతే సీరియస్‌గా పుస్తకాల్ని ముందేసుకుని చదువుకొంటున్నట్లుగా తెలుస్తోంది.... “నిన్ను..... నా స్వార్థంకోసం ఓ మానవ మృగానికి బలి ఇవ్వబోతున్నాను.......నన్ను క్షమించు.....” అని మనసులోనే అనుకొని ....... “అమ్మా..... సరస్వతీ........ ఊళ్ళో అర్జెంట్‌గా పనుంది.... నేను వెళ్ళొచ్చేదాకా నా రూంలో ఉండి చదువుకోమ్మా....” చెప్పింది సుబ్బులక్ష్మి.

పుస్తకాల్ని మోసుకొని....... మౌనంగా ఆమె వెనకే నడచి వెళ్ళింది సరస్వతి.

సరస్వతిని రూమ్‌లో ఉంచి, బయటకెళ్ళిపోయింది సుబ్బులక్ష్మి.

వంటగదిలో నుండి వికటాట్టహాసం చేస్తూ......... గదిలో అకస్మాత్తుగా ప్రత్యక్షమైన మల్లేశాన్ని చూచి... భయకంపితురాలైంది సరస్వతి.

“వార్డెనాంటీ.......... నన్ను రక్షించండి........... ” పిలిచింది ఒక్కసారిగా.

“మాట్లాడకు.... మాట్లాడినా.......... అరిచినా............ ఇక్కడికొచ్చేవారెవరూ లేరు.....నేన్చెప్పినట్లు పడుండు.. అరిచావంటే నోట్లో గుడ్డలు కుక్కుతా.............” కళ్ళెర్రచేశాడు మల్లేశం.

“లేదంకుల్.........నేనలాంటి తప్పు చెయ్యనండీ......... నేను బాగా చదివి కలెక్టర్నవుతానండి.... మీరు మా నాన్నగారంత పెద్దవాళ్ళండీ.. మీరలా చెయ్యకూడదు సార్........ ప్లీజ్ నన్నొది లేయండి.......... నేను కలెక్టర్నయి మా ఊరికి పేరు తీసుకొస్తానండీ... మనసు మార్చుకొని నా మీద జాలి చూపండి....” కన్నీరు మున్నీరుగా విలపిస్తూ బ్రతిమలాడింది......

“నోర్మూయ్......... లేకపోతే చంపేస్తా.... ఎన్‌కౌంటర్ చేసేస్తా.....” మరోసారి కర్కశంగా అరిచాడు మల్లేశం............

రోదిస్తూనే మౌనంగా ఉండి పోయింది సరస్వతి........

పొదివి పట్టుకొని ......... దగ్గరగా లాక్కున్నాడు.........

“ట్రింగ్......... ట్రింగ్....” గట్టిగా రొద చేయసాగింది మల్లేశం సెల్‌ఫోన్!

బటన్ నొక్కి “హలో...” అన్నాడు చిరాగ్గా.

“ఏమండీ.......... అన్యాయం జరిగిపోయిందండీ..... కాలేజీనుండి వస్తూంటే మనమ్మాయి శిరీషను దుండగులెవరో ఆటోలో తీసుకొని పోయారండి.... అర్జెంట్‌గా పదిలక్షలు తీసుకురాకపోతే ......... సామూహికంగా అత్యాచారం చేసి........ హతమారుస్తారటండి........ నాకు భయంగా ఆందోళనగా ఉంది.......... తొందరగా రండి......” కన్నీరు మున్నీరుగా ఫోన్‌లో ఏడవసాగింది మల్లేశం భార్య కళ్యాణి.

నిర్ఘాంతపోయాడు మల్లేశం! హతాశుడై సరస్వతివైపు అయోమయంగా

చూడసాగాడు.. మందు మత్తు దిగిపోయింది....... సరస్వతి వైపు చూస్తుంటే కన్నకూతురు శిరీషను చూస్తున్నట్టే ఉంది.. కళ్ళలో కామం స్థానే పితృప్రేమ నిండిపోయింది.......... "క్షమించమ్మా......." కాళ్ళ మీధ పడబోయాడు.......

ఒక్క నిమిషంలో ఎంత మార్పు!......... మృగం మానవత్వంతో రూపాంతరం చెందిన దివ్య మైన దృశ్యం.....!!

మనసులోనే ఆ ఫోన్‌కాల్‌కి 'థ్యాంక్స్..' చెప్పుకొంది సరస్వతి.

"మీరే నన్ను క్షమించాలి..... మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను......." ప్రాధేయపూర్వకంగా చెప్పింది.. పంజరంలో నుండి బయటపడిన చిలుకలా బయటికి నడుస్తూ.

మల్లేశం అక్కడినుంచి నిష్క్రమించడంతో స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకొంది సరస్వతి.

★ ★ ★

"కళ్యాణి తల్లీ...... థ్యాంక్సమ్మా........... ఓ జీవితాన్ని నిలబెట్టావు......... నువ్వే ఫోన్ చెయ్యక పోతే ఓ అమాయక చిన్నారి.......ఓ చదువులతల్లి భవిష్యత్తు ఛిద్రమయ్యేది..., ఓ ఆడపిల్ల తల్లిగా అర్థం చేసుకొని .. అబద్ధం చెప్పయినా మల్లేశం చేయ బోయే అకృత్యాన్ని ఆపగలిగావు... సరస్వతి తరపున నా కృతజ్ఞతలు కళ్యాణమ్మా........." ఫోన్‌లో సుబ్బలక్ష్మి చెప్పగానే "లేదు సుబ్బలక్ష్మి..... నువ్వే ఫోన్ చెయ్యకపోతే .........నేనేం ఆపగల్గేదాన్నో చెప్పు.. ఈ గొప్పదనమంతా నీదే....... నీకు నా ధన్యవాదములు.......!" అనునయించింది మల్లేశం భార్య కళ్యాణి.

"ఏదేమైనా...... సరస్వతిని కాపాడావు.... దేవుడు నీకు తప్పక మేలు చేస్తాడు.........." దీవించింది సుబ్బలక్ష్మి.

"వార్డెనాంటీ...... నువ్వు చేసిన మేలుని జన్మజన్మలకీ మరిచిపోను......" ఆనందంతో సుబ్బలక్ష్మి కాళ్ళకి నమస్కరించింది. సరస్వతి.... ....కన్నీరుబొట్లుతో సుబ్బలక్ష్మి వేళ్ళను తాకింది సరస్వతి కృతజ్ఞతాపూర్వక హృదయస్పందన!.......

సంతృప్తిగా నిట్టూర్చింది సుబ్బలక్ష్మి !!




# విద్య - వ్యాపారం

ఎమ్.వి. చలపతిరావు

డాలర్‌లు, పౌండ్లు, దీనార్‌లు సముద్రాల
అలల మీదుగా మంద్ర మంద్రంగా
పనినించి ఊహల పావురాలుగా మారి
యిక్కడ గూళ్లను వెతుక్కుంటాయి
గూళ్లలో ఆవాసం ఏర్పరచుకున్న తర్వాతనే
మొదలవుతుంది ముసళ్ల పండుగ
పావురాలు వారం వారం బెంగతో
గూళ్లలోంచి ప్రధాన ద్వారం వైపు
ఆశాపూరితంగా కనుకొలకుల్లో కన్నీళ్లతో
ఎదురు చూడటం ప్రారంభమవుతుంది
కాపలదారుల గింజలు చల్లే వాళ్ల
ఛీత్కారాలతో మనోవ్యధ మరింత అధికం అవుతుంది
అయినా బంగారు భవిష్యత్‌ను గురించిన కలలు
దానికి కళ్లెం వేస్తాయి యింతాచేస్తే
కలలు పండుతాయో లేదోనన్న అనిశ్చిత స్థితి
కొన్ని పావురాలు రూపాయల రూపాంతరాలు
యీ రూపాంతరానికి ఎంత స్వేదం, రుధిరం
బలిగా సమర్పించవలసివచ్చిందో, కలలు వాస్తవాలవుతాయా
అని నిరంతరం మానసిక వ్యధార్తి
గూళ్లు బాహ్యదృష్టికి ఆకర్షణీయమే
కాని వాస్తవంలో ఎంత యిరుకో ఎవరికెరుక
గూళ్లు చేరిన పావురాల మాంసం
ఎంత రుచిగా ఉంటుందో కట్టిన వాళ్లకే ఎరుక
గూళ్ల నిర్మాణంలో ఎందరో సహాయకారులు
అందరూ కలిసి గూళ్లలో చేరిన పావురాలను ఆబగా వేల్చుకొని తినే
నిరంతర మేధాయజ్ఞ నిర్వహణ
యీ హవిర్భాగాలను అధికంగా దండుకోవటానికి
కుతంత్రాలు, పరస్పరాహరణ ప్రయత్నాలు
ప్రధాన ఋత్విజుడి పాదాలను ముద్దు పెట్టుకోవడం
గూఢచారులుగా వ్యవహరించడం, పరస్పరం బురద చల్లుకోవటం
దినచర్యలో ప్రధాన కర్తవ్యాలైపోతాయి
ఆఖరి అంకంలో పావురాల ఆవేదనల అశ్రుగీతాలాపన
ప్రధాన ఋత్విజుడికి యిదంతా ఒక లీల
సహాయకారుల అంతఃకలహాల ఆధారంగా
ఆకాశహర్మ్యాలను నిర్మించాలనుకుంటాడు
'పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిన' చందాన
తానే అన్ని భాగాలకు స్వాహా చేసి హాయిగా నిద్రోతాడు.